క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. శానిటరీ విభాగంలో చనిపోయిన, ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో కొత్త వారిని తీసుకోవటం లేదని, తద్వారా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య తగ్గి, ఉన్న వారిపై పని భారం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, గౌరవ అధ్యక్షుడు జక్కి జేమ్స్, కోశాధికారి తుపాకుల నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి టి.ప్రతాప్, కార్మికులు పాల్గొన్నారు.

యుగంధరాచార్యకు ఉత్తమ ప్రధానోపాధ్యాయ పురస్కారం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని కూరపాటి పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్యను విజయవాడ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ వన్‌టౌన్ బ్రాంచ్ ఉత్తమ ప్రధానోపాధ్యాయ పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఆ సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన విద్యా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బాబూరావు, ఖాదర్ బాషా మాట్లాడుతూ గానుగుల యుగంధరాచార్య 29 సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా పని చేస్తూ 16 డిగ్రీలు పూర్తి చేయటం గొప్ప విషయమన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని కోరారు. అలాగే యుగంధరాచార్య తెలుగు భాషా వికాసానికి పాటుపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి దుర్గారావు, సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కెనాల్‌రోడ్డులో అగ్నిప్రమాదం

- టార్పాలిన్ పట్టాలు విక్రయించే దుకాణంలో ప్రమాదం
- ఐదు గంటలకు పైగా కొనసాగిన మంటలు



దుకాణంలోపల దగ్ధమైన టార్పాలిన్ పట్టాలు, ఇతర సామగ్రి



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కెనాల్‌రోడ్డులో బుధవారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం జరిగింది. టార్పాలిన్, ప్లాస్టిక్ పట్టాలను విక్రయించే ఒక దుకాణంలో ఒక్కసారిగా చెలరేగిన మంటలు నాలుగైదు గంటలపాటు కొనసాగాయి. వివరాల్లోకి వెళితే... కెనాల్ రోడ్డు వినాయకుని గుడి సమీపంలో తమ్మన మురళి అనే వ్యక్తి వెంకటేశ్వర ట్రేడర్స్ పేరుతో దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దుకాణంలో బుధవారం తెల్లవారు జామున సుమారు రెండు గంటల సమయంలో మంటలు చెలరేగడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారమందించారు. టార్పాలిన్స్, ప్లాస్టిక్ వస్తువులు కావటంతో మంటలు అదుపు చేయడానికి ఎక్కువ సమయం పట్టింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే దుకాణంలో సరుకు ఎంత ఉన్నదీ వివరాలను చూసి ఎంత నష్టం జరిగిందనేది చెబుతామని యజమాని తెలిపారు.

శ్రీనివాసుని సన్నిధిలో సాలిగ్రామ అభిషేకం



సాలిగ్రామాలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కార్తిక ద్వాదశి(చిలుకు ద్వాదశి)ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో సాలిగ్రామాలకు విశేష అభిషేకాలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున ఆలయంలోని స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం ఆలయ ప్రాంగణంలో భోగ శ్రీనివాసునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాలిగ్రామాలకు క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం విశేషంగా అలంకరించారు. కార్తిక ద్వాదశి విశేషాన్ని ఆలయ అర్చకులు భక్తులకు వివరించారు. చిలుకు ద్వాదశి వ్రతం ఆచరించిన భక్తుల ఇంటికి శ్రీవిష్ణువు పరివార సమేతంగా విచ్చేస్తారని పేర్కొన్నారు. తులసి కోటనే బృందావనంగా భావించి తులసి, ఉసిరి మొక్కల వద్ద లక్ష్మీ నారాయణలను పూజించాలని తెలిపారు. అనంతరం స్వామివారికి తులసీ దళాలతో అర్చన నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

కూటమిలోకి వెళ్లిన కార్పొరేటర్లు రాజీనామా చేయాలి

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమిలో చేరిన కార్పొరేటర్లకు చిత్తశుద్ధి ఉంటే తమ పదవులకు రాజీనామా చేసి మాట్లాడాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో కార్పొరేటర్లు మండేపూడి ఛటర్జీ, పడిగిపాటి చైతన్య రెడ్డి, ఎండీ ఇర్ఫాన్, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, మైనార్టీ సెల్ రాష్ట్ర నేత షేక్ హయత్‌లు బుధవారం సాయంత్రం మీడియా సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పక్షాన పోటీ చేసి కార్పొరేటర్లుగా గెలిచిన వ్యక్తులు పార్టీని, మాజీ శాసనసభ్యుడు వెలంపల్లిని శ్రీనివాసరావును విమర్శించటం తిన్నింటి వాసాలు లెక్కిపెట్టడమేనన్నారు. విమర్శలు చేస్తున్న కార్పొరేటర్ల డివిజన్లలో జరిగిన అభివృద్ధిపై వారు తమ గుండెలపై చెయ్యి వేసుకొని జరగలేదని చెప్పాలని నిలదీశారు. సుజనా చౌదరి ఐదు మాసాల పాలనపై బహిరంగ చర్చకు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లగా మేము సిద్ధంగా ఉన్నామన్నారు. వెలంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మీమీ డివిజన్లలో ఎంత మందికి విరాళాలు ఇప్పించారో మీరే చెప్పాలన్నారు. సుజనా చౌదరి వారాలాబ్బాయిలా వారానికి ఒక్కసారి వస్తున్నాడని అది కూడా కూటమి నాయకులే ప్రచారం చేస్తున్నారన్నారు. బీజేపీలో ఉండి పుష్కరాల సమయంలో చంద్రబాబు దేవాలయాలను కూల్చేస్తే మొద్దు నిద్రపోయిన వ్యక్తి అడ్డూరి శ్రీరామ్ అని ఎద్దేవా చేశారు.

భువనేశ్వరీదేవిగా భ్రమరాంబ దర్శనం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కొలువై ఉన్న అమ్మవారు బుధవారం శ్రీ భువనేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో జరుగుతున్న నక్తదీక్షా మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో వివిధ ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. చిలుక ద్వాదశిని పురస్కరించుకొని ఆలయంలోని ఇతర ఉపాలయాల్లోనూ విశేష కార్యక్రమాలు, మల్లేశ్వరస్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలను వైభవంగా చేపట్టారు. సహస్ర లింగార్చన, ప్రత్యేక హోమాలు, అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలను నిర్వహించారు. త్రిశతి, ఖడ్గమాలార్చన తదితర కార్యక్రమాలను, సాయంత్రం స్వామివారికి పంచహారతుల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా అర్చకులు జరిపారు. అనంతరం గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవను నిర్వహించారు.

ఇంద్రకీలాద్రిపై వైభవంగా కార్తిక పూజలు



సహస్ర లింగార్చన నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



స్వామి వారికి విశేష అలంకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారికి బుధవారం పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తెల్లవారుజాము 5 గంటల నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించగా, పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి పూజలు జరిపించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చనను ఆలయ అర్చకులు జరిపించారు. లింగార్చన అనంతరం స్వామి వారికి నారికేళాలతో అలంకరించి పూజలు చేశారు. మల్లేశ్వర స్వామివారి ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపానికి ఆలయ ఈవో కె.ఎస్.రామరావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్లకు ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించగా, పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీలతో సృజనాత్మకతకు పదును



చిత్రాలు ప్రదర్శిస్తున్న చిన్నారులతో నిర్వాహకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మకతకు మరింత పదును పెట్టేందుకు డ్రాయింగ్ పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్‌శాఖ కమిషనర్ అనిల్ చంద్ర పునీత చెప్పారు. అనంత్ డైమండ్స్, డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా) కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 'స్పా' కళాశాల ఆవరణలో డ్రాయింగ్ పోటీలు బుధవారం జరిగాయి. అనిల్ చంద్ర పునీత హాజరై పోటీలను ప్రారంభించారు.

17న బహుమతులు

అనంత్ డైమండ్స్ వ్యవస్థాపకుడు జాస్తి అనంత పద్మశేఖర్ మాట్లాడుతూ.. చిన్నారుల్లో ఉన్న భావాలను వారు చాలా చక్కగా చిత్రాల రూపంలో బహిర్గతం చేశారన్నారు. డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ చైర్మన్ పి.రమేష్ మాట్లాడుతూ.. చిత్రలేఖనంపై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించడానికి ప్రతి ఏడాది బాలల దినోత్సవం సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. విజేతలకు ఈ నెల 17వ తేదీ స్పా కళాశాలలో జరిగే బహుమతులను అందజేస్తామని చెప్పారు. స్పా కళాశాల రిజిస్ట్రార్ కేవీ.ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సంతోష్‌కుమార్, టి.మాధవరావు, చిత్రకారులు టి.మృత్యుంజయరావు, చిన్న స్ఫూర్తి, ఎస్.శ్రీధర్, వై.కళాసాగర్, బీఎస్‌వీ.రమేష్, పర్యావరణ మానవ సమాజ భద్రత బాధ్యత ఫౌండేషన్ చైర్మన్ సింగలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లాల్లోని పాఠశాలలు కళాశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై ఉత్సాహంగా చిత్రాలను గీశారు. చిత్రలేఖనం పోటీల సందర్భంగా స్పా కళాశాల ఆవరణ అంతా సందడిగా మారింది.

నరసాయమ్మ మృతి తీరని లోటు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు రాంపిళ్ల నరసాయమ్మ మృతి భారతీయ సమాజానికి తీరని లోటు అని ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాయన బాబూజీ (బాబ్జీ) పోతిన వెంకటేశ్వరస్వామి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన మహిళా స్వాతంత్ర్య సమరయోధుల్లో ఈ ప్రాంతం నుంచి నరసాయమ్మ ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు. తమ నగరాల సంఘీయురాలిగా తమ జాతికి వన్నె తెచ్చారని పేర్కొన్నారు. నాటి రాష్ట్రపతులు ప్రణబ్‌ముఖర్జీ, రామనాథ్ కోవింద్, ముఖ్యమంత్రి చంద్రబాబు వంటి ప్రముఖుల చేతుల మీదుగా రాంపిళ్ల నరసాయమ్మ పలుమార్లు సత్కారాలను అందుకున్నారన్నారు. నరసాయమ్మ జీవితం నేటి యువతరానికి ఆదర్శమని తెలిపారు. స్వాతంత్ర్య అనంతరం కేంద్ర ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ సలహా మండలిలో నరసాయమ్మకు స్థానం కల్పించడంతో ఆమె స్వాతంత్ర్య సమరయోధుల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేశారని తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో స్వాతంత్ర్య సమరయోధులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పలు సదుపాయాలను కలిపించడంలో నరసాయమ్మ ప్రముఖ పాత్ర వహించారని చెప్పారు. ఆమె మృతికి తమ సంఘం పక్షాన అంజలి ఘటిస్తున్నామని పేర్కొన్నారు.

నిలిచి ఉన్న బస్సును ఢీకొట్టిన మరో బస్సు

డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులకు గాయాలు

కేతేపల్లి: ఇంజన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో హైవేపై నిలిచిపోయిన ఏపీకి చెందిన ఆర్టీసీ బస్సును మరో ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటనలో డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా కేతేపల్లి వద్ద విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడు డిపోకు చెందిన ఆర్టీసీ లగ్జరీ బస్సు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తోంది. కేతేపల్లి వద్దకు చేరుకోగానే ఇంజన్‌లో సాంకేతిక లోపం ఏర్పడి రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో సిబ్బంది బస్సులోని ప్రయాణికులను మరో బస్సులోకి ఎక్కించి గమ్యస్థానాలకు పంపించారు. అదే మార్గంలో వస్తున్న ఉయ్యూరు డిపోకు చెందిన మరో ఆర్టీసీ లగ్జరీ బస్సు కేతేపల్లి వద్ద రోడ్డుపై నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. దీంతో ఉయ్యూరు బస్సు డ్రైవర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు రెండు కాళ్లు విరిగిపోయాయి. బస్సులో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన పి.సూర్యసాయి, తిరుపతమ్మ, ఎం.రజనీలకు స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కేతేపల్లి ఎస్ఐ శివతేజ తెలిపారు.

18 కేజీల గంజాయి స్వాధీనం



విజయవాడ స్టేషన్‌లో గంజాయి తరలిస్తున్న యువకుడిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న యువకుడిని జీఆర్‌పీ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 18 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ జేవీ రమణ తెలిపిన వివరాల ప్రకారం ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా బుధవారం విజయవాడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఖాతంగ జేనా (30) ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న బ్యాగును సోదా చేయగా అందులో 18 కేజీల గంజాయి లభ్యమైంది. ఒడిశాలోని సంగ్మోలి అనే గ్రామంలో అరుణ్ స్పైస్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి, దాన్ని చెన్నైలో అధిక ధరకు విక్రయించేందుకు రైలులో వెళ్తున్నట్లు విచారణలో వెల్లడించాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

29న వీఎంసీ కౌన్సిల్ సమావేశం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఈ నెల 29వ తేదీన నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే కార్పొరేటర్లకు డివిజన్ సమస్యలపై ప్రతిపాదనలు పంపాలని వీఎంసీ కార్యదర్శి సూచించారు. ఈ మేరకు కౌన్సిల్ కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

వైభవంగా తులసీ కల్యాణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ వారి సన్నిధిలో తులసీ కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. నగరంలోని పురాతన ఆలయమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో చిలుక ద్వాదశి సందర్భంగా విష్ణు సేన మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తిని, తులసీ అమ్మవారిని వేదికపై అధిష్ఠింపజేసి కల్యాణోత్సవాన్ని చేపట్టారు. ఆలయ అర్చకస్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షితులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

'జీవన్ ప్రమాణ్' సేవలను సద్వినియోగం చేసుకోవాలి

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



జీవన్ ప్రమాణ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, ఇతర అధికారులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విశ్రాంత ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్‌లకు సులభతరమైన సేవలు అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జీవన్ ప్రమాణ్' డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్‌లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే వ్యాప్తంగా ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా బుధవారం విజయవాడ రైల్వే సమీపంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ఏడీఆర్ఎంలు, బ్యాంకు అధికారులతో కలసి జీవన్ ప్రమాణ్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ నిర్వహణలో సులభతర సేవలు అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జీవన్ ప్రమాణ్ ఫేస్ అథెంటికేషన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్‌లను సమర్పించే సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీంతో పెన్షనర్‌లకు తమ లైఫ్ సర్టిఫికెట్‌లను సమర్పించేందుకు పెన్షన్ పంపిణీ కేంద్రాల చుట్టూ తిరిగే ఇబ్బందులు ఉండవన్నారు. సంబంధిత పత్రాలు డౌన్‌లోడ్ చేసుకోవడం, ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పించడం తదితర సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. సీనియర్ సిటిజన్‌లకు పారదర్శక, యూజర్ ఫ్రెండ్లీ సేవలు అందించడంలో డిజిటల్ సేవలు అందుబాటులోకి రావటం గొప్పమార్పుగా ఆయన అభివర్ణించారు. డిజిటల్ సర్టిఫికెట్ సేవలను పొందేందుకు పెన్షనర్‌లకు సరైన మార్గనిర్దేశం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు శ్రీనివాసరావు కొండా, పీఈ ఎడ్విన్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.